సాక్షి ఖమ్మం

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



అనే నేను...

ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో శనివారం ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి ప్రణాళికలను 'సాక్షి'కి వివరించారు. 8లో



సర్వమత సౌభ్రాతృత్వం

సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్న ఇల్లెందు మండలంలోని హజ్రత్ నాగుల్ మీరా దర్గా ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. 10లో

గరిష్టం / కనిష్టం

31° / 17°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం, సాయంత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం, మంత్రులు

ఖమ్మంవన్‌టౌన్/భద్రాచలం: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం జిల్లాకు రానున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక హైదరాబాద్ వెళ్లిన వీరు మంత్రుల హోదాలో తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఖమ్మం జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్దకు చేరుకోనున్న మంత్రులకు ఘనస్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి నుంచి ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకుని మాట్లాడతారు. ఆ తర్వాత 11.30 గంటలకు కొత్తగూడెంలో జరిగే సన్మానోత్సవంలో పాల్గొన్ననున్న మంత్రులు.. అక్కడి నుంచి భద్రాచలం వెళ్తారు. భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశాక మధిర మీదుగా ఖమ్మం వస్తారు. మంత్రుల పర్యటనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

నేటి నుంచి పీజీ తరగతులు

ఖమ్మం సహకారనగర్: బీఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో 2023–2024 విద్యాసంవత్సరానికి గాను పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదివారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ఖమ్మం అధ్యయన కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలకు వరకు జరుగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



పల్లకీ సేవలో పాల్గొన్న, అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో శ్రీవారి పాదంతో పాటుస్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా హాజరైన భక్తులు దర్శించుకున్నారు. ఆతర్వాత నిర్వహించిన పల్లకీసేవలో కూడా పాల్గొన్న భక్తులు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే

ఖమ్మం సహకార నగర్: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అక్టోబర్ 11వ తేదీ నుంచి గ్రీవెన్స్ డేను రద్దు చేశారు. ప్రస్తుతం కోడ్ ముగిసిన నేపథ్యాన ప్రతీ సోమవారం యథావిధిగా గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

కేటీపీఎస్ ఆరో దశలో మరమ్మతులు పూర్తి


25 రోజుల తర్వాత అందుబాటులోకి విద్యుదుత్పత్తి




కేటీపీఎస్ ఆరో దశ కర్మాగారం

పాల్వంచ : కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలో వార్షిక మరమ్మతులు పూర్తయ్యాయి. 500 మెగావాట్ల సామర్థ్యం గల 11వ యూనిట్‌లో గత నెల 16న వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. అధికారులు, ఇంజనీర్లు, ఆర్టిజన్ కార్మికులు 25 రోజుల పాటు శ్రమించి పనులు పూర్తి చేయడంతో శనివారం యూనిట్‌ను పునరుద్ధరించి రాష్ట్ర గ్రిడ్‌కు ఉత్పత్తిని అనుసంధానం చేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మధిర, పాలేరు, ఖమ్మం ఎమ్మెల్యేలు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు







మనోళ్లు కీలకం !

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురికి మంత్రివర్గంలో ప్రాధాన్యత శాఖలు దక్కాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ముగ్గురికి మంత్రివర్గంలో చోటు కల్పించి, కీలకమైన శాఖలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేటాయించడం విశేషం. జిల్లాకు చెందిన జలగం వెంగళరావు 1968లో హోంశాఖ మంత్రిగా పనిచేయగా.. 1973 నుంచి 1978 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనే కాక శీలం సిద్ధారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాంరెడ్డి వెంకటరెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు జిల్లా అభివృద్ధిపై చెరగని ముద్ర వేశారు. మళ్లీ ఇప్పుడు జిల్లాకు చెందిన ముగ్గురు ప్రధాన నేతలకు రాష్ట్ర ప్రభుత్వంలో ప్రముఖ పాత్ర పోషించే అవకాశం దక్కగా... ఉమ్మడి జిల్లా అభివృద్ధికి వేగంగా అడుగులు పడతాయని ప్రజలు భావిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

మంత్రులు ముగ్గురికి ప్రధాన శాఖలు

- డిప్యూటీ సీఎం భట్టికి ఆర్థిక, విద్యుత్‌శాఖ
- పొంగులేటికి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖలు
- తుమ్మలకు వ్యవసాయం, అనుబంధ, చేనేత శాఖలు
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి వేగంగా అడుగులు పడే అవకాశం

ప్రాధాన్యత కేటాయింపు

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలుగా ఉన్న మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, పాలేరు, ఖమ్మం ఎమ్మెల్యేలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం లభించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఆర్థిక, విద్యుత్ శాఖ, పొంగులేటికి రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖలు, తుమ్మల నాగేశ్వరరావుకు వ్యవసాయం, మార్కెటింగ్, కో ఆపరేటివ్, చేనేత శాఖలను కేటాయించారు. భట్టి గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. దీంతో ఈసారి ఆయనకు ప్రభుత్వంలో రెండో స్థానం దక్కింది. తుమ్మల నాగేశ్వరరావు టీడీపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. టీడీపీ హయాంలో చిన్ననీటి పారుదలశాఖ, ప్రొహిబిషన్, భారీ, మధ్య తరహా నీటిపారుదల శాఖ, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇక పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2014లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఈసారి అసెంబ్లీ బరిలో దిగగా.. ఘన విజయం సాధించడంతో మంత్రి పదవి దక్కింది.

ఉద్దండుల ప్రాతినిధ్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి గతంలో అతిరథ మహారథులు రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రాధాన్యత కలిగిన మంత్రిత్వ శాఖలను నిర్వర్తించారు. ఇందులో జలగం వెంగళరావు 1973 నుంచి 1978 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. అంతకుముందు 1968లో కాసు బ్రహ్మానందరెడ్డి సారథ్యాన జలగం హోంశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో నక్సలైట్లను ఉక్కుపాదంతో అణచివేశారు. ఆ తర్వాత జిల్లాను అభివృద్ధిలో ఉరకలెత్తించిన నేతల్లో శీలం సిద్ధారెడ్డి కీలకంగా నిలుస్తారు. జిల్లా నుంచి తొలి మంత్రిగా 1967లో కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో ఆయన నీటి పారుదల, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1971లో పీవీ.నరసింహారావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ మంత్రిగా కూడా విధులు నిర్వర్తించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి పరంగా జలగం, సిద్ధారెడ్డి హయాంలోనే కొత్త పుంతలు తొక్కింది.

అభివృద్ధిని కొనసాగిస్తూ..

ఆ తర్వాత మంత్రులుగా పనిచేసిన పలు పార్టీల నేతలు ఆ అభివృద్ధిని ముందుకు కొనసాగించారు. వీరిలో తుమ్మల నాగేశ్వరరావు 1985, 1995, 1996, 1999, 2001లో మంత్రిగా పనిచేసి జిల్లాకు కొత్త రూపు తీసుకొచ్చారు. అలాగే 1988 ఏడాది టీడీపీ హయాంలో కొత్తగూడెం నుంచి కోనేరు నాగేశ్వరరావు చిన్ననీటిపారుదల శాఖ మంత్రిగా, 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి జలగం ప్రసాదరావు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో, 2004లో సంభాని చంద్రశేఖర్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా, 2008లో వనమా వెంకటేశ్వరరావు వైద్యవిధాన పరిషత్ మంత్రిగా పనిచేశారు. అలాగే, వైఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో రాంరెడ్డి వెంకటరెడ్డి సహకార, కార్మిక, ఉద్యానవన శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలోనూ మంత్రిగా పనిచేశారు. బీఆర్‌ఎస్ రెండో విడత అధికారం చేపట్టిన తర్వాత ఖమ్మం నుంచి ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్‌కు రవాణా శాఖ మంత్రి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఖమ్మం నియోజకవర్గంతోనే కాక ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి సైతం దోహదపడ్డారు.

ఎమ్మెల్యేల ప్రమాణం

తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన మూడో శాసనసభలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎన్నికైన పది మంది శాసనసభ్యులు శనివారం ప్రమాణం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్యతో పాటు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఇందులో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఐదుగురు ఉండగా... తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టిన సమయాన ఆనందం వ్యక్తం చేశారు.

మహిళలకు 'మహాలక్ష్మి' వరం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

- మహిళా సాధికారతకు తొలి అడుగు
- జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఖమ్మం బస్టాండ్‌లో పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళా సాధికారతకు తొలి అడుగుగా నిలుస్తుందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో శనివారం మధ్యాహ్నం ఆయన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేలా ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. అత్యధిక శాతం ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుండగా, మహాలక్ష్మి ద్వారా మహిళలపై భారం తగ్గుతుందని తెలిపారు. బస్సుల చార్జీల భారంతో చాలా మంది చదువు మధ్యలో మానివేసే వారని.. పేద విద్యార్థినులకు ఈ పథకం వరంలా మారనుందని అన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం ఖమ్మం రీజియన్‌లో ప్రతిరోజూ 40వేల నుండి 50 వేల మంది మహిళలు ప్రయాణిస్తుండగా, వయసుతో సంబంధం లేకుండా మహిళలందరికే కాక ట్రాన్స్‌జెండర్లకు ఈ పథకం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి ఆయన మహాలక్ష్మి జీరో టికెట్‌ను ఆవిష్కరించారు. అలాగే, బస్సులో మహిళలకు టికెట్లు అందజేసి కొంత దూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న, జిల్లా రవాణ శాఖాధికారి టి.కిషన్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారి సుమ, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం ప్రతిభ, ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బస్సులో మహిళకు టికెట్ అందజేస్తున్న కలెక్టర్

పేదలకు అండగా 'ఆరోగ్యశ్రీ'

ప్రభుత్వ ఆస్పత్రిలో లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్

ఖమ్మం వైద్యవిభాగం: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు అండగా ఉంటోందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అందే వైద్య సాయం పరిమితిని రూ.10లక్షలకు పెంచగా, ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో శనివారం కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒకేరోజు రెండు కొత్త పథకాలను ప్రజల కోసం ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారని చెప్పారు. ఈ పథకం ద్వారా 1,672 రకాల వ్యాధులకు చికిత్స అందుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవల కోసం 250 బెడ్లు కేటాయించామని, అవసరమైతే మరిన్ని పెంచుతామని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందడమేకాక ప్రభుత్వ ఆస్పతులు బలోపేతం అవుతాయని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, డీఆర్‌డీఓ విద్యాచందన, డీడబ్ల్యూఓ సుమ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, అధికారులు ఎల్.కిరణ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, అమర్ సింగ్, మాధవరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

గోదావరి మాతకు హారతులు సమర్పిస్తున్న రామాలయ అర్చకులు



గంగమ్మకు ఘన హారతి

- రామయ్య పాదుకలకు ప్రత్యేక పూజలు
- పులకించిన గోదావరి నదీ తీరం


భద్రాచలం: జగదభి రాముడు కొలువై ఉన్న దక్షిణ అయోధ్యలో గోదావరి మాతకు నదీహారతి వేడుక ఆద్యంతం కనులపండువగా సాగింది. భక్తులు ఎంతో పవిత్రంగా, నిష్టగా పూజలు నిర్వహించే కార్తీక మాసంలో బహుళ ద్వాదశి రోజున అందిన హారతి, పూజలతో గోదారి తల్లి పులకించింది. శనివారం రాత్రి గోదావరి వద్ద జరిగిన 'పుణ్య నదీ హారతి'తో భద్రగిరిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

స్వామివారి పాదుకలకు పూజలు..

కార్తీక మాసం బహుళ ద్వాదశి రోజున గోదావరి మాతకు నదీ హారతి సమర్పించడం దశాబ్ద కాలంగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ స్వామివారి పాదుకలను ఊరేగింపుగా తీసుకొచ్చి కరకట్ట కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు మొదట విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పారాయణం నిర్వహించారు. వేదపండితులు కార్తీకమాసం, నదీహారతి విశిష్టతను భక్తులకు వివరించారు.

పసుపు, కుంకుమ, హారతుల సమర్పణ..

రామాలయ అర్చకులు, వేద పండితులు గోదావరి మాతకు పసుపు, కుంకుమ, వస్త్రాలు సమర్పించారు. నది మధ్యలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పడవలో అర్చకులు ద్వయ, కుంభ, అష్ట, నక్షత్ర, ద్వాదశ హారతులు ఇచ్చారు. భక్తులు సైతం గోదావరిలో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, ఏఈఓ భవానీ రామకృష్ణ, ఈఈ రవీంద్ర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దేవస్థానం అధికారుల ప్రచార లోపంతో భక్తుల సంఖ్య తక్కువగా కనిపించింది.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రామాలయంలో సుదర్శన యాగం

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను జరి పారు. స్వామివారికి అంతరాలయంలో సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో స్వామివారి ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిధులు రాలే.. అభివృద్ధి కాలే...

- గ్రామపంచాయతీలపై గత ప్రభుత్వం శీతకన్ను
- అప్పు తెచ్చి మరీ పనులు చేసిన సర్పంచ్‌లు
- వచ్చేనెలతో ముగియనున్న పదవీకాలం



ఖమ్మంవన్‌టౌన్: పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్న జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన మాటను గత పాలకులు పెడచెవిన పెట్టారు. పాలకవర్గాలు కొలువుదీరిన కొంతకాలం చెక్‌పవర్ ఇవ్వక.. ఆతర్వాత ఇచ్చినా రెండేళ్ల పాటు అరకొర నిధులతోనే సర్కార్ సరిపుచ్చింది. అనంతరం రూపాయి కూడా ఇవ్వకుండా కాలం వెళ్లదీయడంతో గ్రామాల్లో అభివృద్ధి ఓ అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతోంది. మరోపక్క చేసిన పనులకూ గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం.. పూర్తిగా కేంద్రం ఇచ్చే గ్రాంట్లపైనే ఆధారపడాల్సి రావడంతో పాలకవర్గాలు పడిన అవస్థలు అన్నీఇన్నీ కావు. కేంద్రం గ్రాంట్లు, పన్నులను కలిపి పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు వెచ్చిస్తూ సర్పంచ్‌లు గడిపారు. ఇక కేంద్రం గ్రాంట్ రెండు, మూడు నెలలకోసారి రావడం, అందులో నుంచి విద్యుత్ బిల్లులు రాష్ట్రప్రభుత్వం మినహాయించుకోవడం సర్పంచ్‌లకు కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టాయి.

అంతు లేని నిరీక్షణ

జిల్లావ్యాప్తంగా 589 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు గడిచిన రెండేళ్లుగా నిధుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అయినా గడిచిన ప్రభుత్వం ఏనాడూ తమ గోడు పట్టించుకోలేదని వాపోతున్నారు. కొందరు సొంత డబ్బు వెచ్చించి సీసీ రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేశారు. మరికొందరు బిల్లులు వస్తాయనే నమ్మకంతో రూ.5లక్షల నుండి రూ.20లక్షల మేర అప్పులు తెచ్చి పనులు చేయగా ఇబ్బంది పడుతున్నారు. కాగా, పాలకవర్గాల పదవీకాలం వచ్చేనెల 31వ తేదీతో ముగియనుంది. ఫిబ్రవరి 1న నూతన పాలకవర్గాలు కొలువుదీరాల్సి ఉండగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలపై దృష్టి సారించింది. అయితే, కొత్త ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తుందా, స్పెషల్ ఆఫీసర్ల పాలనకు మొగ్గు చూపుతుందా అనేది తేలాల్సి ఉంది. ఏదిఏమైనా తమకు రావాల్సిన బిల్లుల పరిస్థితి ఏమిటనే ఆందోళన సర్పంచ్‌ల్లో నెలకొంది.

అభివృద్ధి చేయొచ్చనే ఆశతో...

ఊరి అభివృద్ధి కోసం గడిచిన ఎన్నికల్లో యువ అభ్యర్థులు పోటీకి దిగారు. ఎప్పుడు లేనట్లు 2019 ఎన్నికల్లో చదువుకున్న యువత పోటీ చేయడం విశేషం. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిధులు సరిగా ఇవ్వకపోవడంతో అనవసరంగా పోటీ చేశామని వారు ఇప్పుడు వాపోతున్నారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల పర్యవేక్షణకే అయితే పాలకవర్గాలు అవసరం లేదని.. ఉద్యోగులు సరిపోతారని వారు చెబుతున్నారు.

నిధుల లేమితోనే ఇక్కట్లు..



గత రాష్ట్రప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. 1981కి ముందు డీఎండీ(డిస్ట్రిక్ట్ మినరల్ డెవలప్‌మెంట్) నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు వచ్చేవి. ఇప్పుడు వాటి మీద అజమాయిషీని జిల్లా మంత్రికి అప్పగించడంతో వారు చెప్పిన పనులకే కేటాయిస్తున్నారు. దీంతో క్వారీలు, గనులు ఉన్న గ్రామాల్లో రోడ్లన్నీ ధ్వంసమైనా ప్రభుత్వ నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోపక్క కేంద్రం ఇచ్చే గ్రాంట్ నుండి విద్యుత్ బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. పూర్తయిన పనులకు ఎంబీలు చేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాక అప్పులు ఎలా తీర్చాలా అనే ఆవేదనలో సర్పంచ్‌లు కొట్టుమిట్టాడుతున్నారు.

– పుసులూరి నరేందర్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



కార్తీకం.. కమనీయం

రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడిలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. దీంతో గ్రామం దేదీప్యమానంగా కాంతులీనింది. వేదిక కన్వీనర్ భూక్యా బన్సీలాల్‌తో పాటు గాడి సత్యనారాయణ, గుత్తా వెంకటేశ్వర్లు, గుత్తా రవి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

– రఘునాథపాలెం

క్లుప్తంగా

ముక్కోటి ఆహ్వాన పత్రికలు అందజేత..



మంత్రి పొంగులేటిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు, ఈఓ

భద్రాచలం: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి భద్రాద్రి రామాలయ ఈఓ రమాదేవి, వేద పండితులు శనివారం హైదాబాద్‌లో స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించారు. ఈనెల 22, 23 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వారా దర్శనం వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు సైతం ఆహ్వాన పత్రికలు అందించామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణకు దారితీసిన వాట్సప్ మెసేజ్‌లు

నేలకొండపల్లి: వాట్సప్‌లో పెట్టిన మెసేజ్‌లు ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీశాయి. నేలకొండపల్లికి చెందిన శివ అనే వ్యక్తి జిల్లాకు చెందిన మంత్రుల ప్రమాణస్వీకారం సందర్భంగా వాట్సాప్‌లో శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం ఫొటోలు పోస్ట్ చేశాడు. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్, భిక్షం ఆయనను కించపరుస్తూ ఇంకో పోస్టు పెట్టారు. దీంతో పరస్పరం మాటలతో దూషించుకుంటుండగా అది పెద్దదై ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల వారు నేలకొండపల్లి సెంటర్‌కు చేరుకుని బాహాబాహీకి దిగారు. అనంతరం పోలీసులను ఆశ్రయించగా సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు.

యువకుడి అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన నిమ్మన అరవింద్ అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. ఖానాపురంలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న అరవింద్ ఈ నెల 7న పనికి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో ఆయన తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పార్కింగ్ చేసిన వ్యాన్ దగ్ధం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ శ్రీలక్ష్మీనగర్‌లోని 7వ లైన్‌లో పార్కింగ్ చేసిన మినీ వ్యాన్ దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు డ్రైవర్ ఎం.యాకూబ్ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రతిరోజు వ్యాన్‌లో ఒక బ్రెడ్ కంపెనీకి చెందిన తినుబండారాలను యాకూబ్ షాపులకు సరఫరా చేస్తుంటాడు. ఈ నెల 7న కూడా సరఫరా చేసిన ఆయన మిగిలిన సామగ్రితో మధ్యాహ్నం ఇంటి సమీపాన పార్క్ చేసి వెళ్లాడు. కాసేపటికే వ్యాన్‌లో మంటలు మొదలై దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుండగా, బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రెప్పపాటులో తప్పిన ప్రమాదం



కుప్పకూలిన కాంతి ఇంటి పైకప్పు

నేలకొండపల్లి: ఇటీవల ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఇల్లు కూలి దంపతులు మృతి చెందిన ఘటన మరువక ముందే మరో ప్రమాదం రెప్పపాటులో తప్పింది. నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన భూక్యా కాంతి శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా ఇంటి పైకప్పు కుప్పకూలింది. తాజా వర్షాలతో శిథిలావస్థకు చేరిన ఇంటి కప్పు తడవడంతో ఈ ఘటన జరిగింది. అయితే, కాంతి నిద్రిస్తున్న మంచం పక్కనే ఇంటి వాసాలు, పెంకులు కూలగా ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. స్థానికులు చేరుకుని ఆమెను బంధువుల ఇంటికి పంపించారు.

రోడ్డుప్రమాదంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్–9కు చెందిన దంపతులు డీకొండ శ్రీనివాస్, శ్రీలక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గత నెల 30న వారు ద్విచక్రవాహనంపై ఖానాపురం వైపు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో దూడలు మృతి

సత్తుపల్లిరూరల్: విద్యుదాఘాతంతో దూడలు మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం తుంబూరులో శనివారం చోటుచేసుకుంది. తుంబూరులోని రైతు నున్నా శ్రీనివాసరావుకు చెందిన మూడేళ్ల వయస్సు ఉన్న రెండు దూడలు నర్సింహాస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పొలంలో మేతకు వెళ్లాయి. అక్కడ సర్వీస్ వైర్లను తాకడంతో షాక్ కొట్టగా మృతి చెందాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు విద్యుత్, పశుసంవర్థక శాఖ అధికారులు పరిశీలించారు.

అనే నేను...

- ప్రమాణ స్వీకారం చేసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటాం..
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి

తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ శనివారం కొలువుదీరింది. ఈ సందర్భంగా ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి ఎన్నికైన మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, మాలోతు రాందాస్‌నాయక్, డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈమేరకు ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేలతో 'సాక్షి' ఫోన్‌లో మాట్లాడగా వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ఖమ్మంరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తా. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు మొదలుకాగా, మిగిలిన గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలులోకి వస్తాయి. ప్రజాప్రభుత్వంగా ప్రజలకు అందుబాటులో ఉంటాం. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన పూలే భవన్ సాక్షిగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి వెల్లువలా వస్తున్నారు. నన్ను అత్యధిక మెజార్టీతో పాలేరు రుణం తీర్చుకోలేనిది. ఉమ్మడి జిల్లా ప్రజల ఆశీస్సులతో తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టినందుకు ఆనందంగా ఉండగా.. వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా.

– పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి (పాలేరు ఎమ్మెల్యే)


చాలా సంతోషంగా ఉంది..



అశ్వారావుపేట: తొలిసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది, అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరంగా ఉంది. నిరంతరం ప్రజా సేవలో ఉన్న నాకు మరింత సేవ చేసే అవకాశాన్ని నియోజకవర్గ ప్రజానీకం ఇచ్చింది. శాసనసభ్యుడిగా నా వంతు సేవ, అభివృద్ధి చేసి అందరి మన్ననలు పొందుతా. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– జారె ఆదినారాయణ, అశ్వారావుపేట ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి కృషి



బూర్గంపాడు: పినపాక నియోజకవర్గంలో పేరుకుపోయిన ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తుంది. ఇప్పటికే మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించింది. ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా పెంచింది. మిగిలిన ఆరు గ్యారంటీల అమలు కూడా త్వరలోనే మొదలవుతుంది. నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– పాయం వెంకటేశ్వర్లు, పినపాక ఎమ్మెల్యే

విద్య, వైద్యంపై దృష్టి సారిస్తా..



సత్తుపల్లి: మట్టా కుటుంబం నుంచి తొలి మహిళా ఎమ్మెల్యేగా శాసనసభకు వెళ్లడాన్ని మాటల్లో చెప్పలేను. స్వయంగా వైద్యురాలినైన నేను అందరికీ మెరుగైన వైద్యసేవలు, విద్య అందించడాన్ని ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తా. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అందరికీ అందేలా కార్యాచరణ రూపొందించుకుని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేలా పనిచేస్తా. స్థానికురాలినైనా నాకు ప్రజలు నేరుగా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు. అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉంటాను. సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో పని చేస్తా. నన్ను ఆశీర్వదించిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

– డాక్టర్ మట్టా రాగమయి, సత్తుపల్లి ఎమ్మెల్యే


గొప్ప బాధ్యతగా భావిస్తున్నా..



భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో అడుగు పెట్టడాన్ని గొప్ప బాధ్యతగా భావిస్తున్నాను. తొలిసారి అసెంబ్లీలో శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయటం మధురానుభూతి. భద్రాచలం ప్రాంత ప్రజలు నాపై ఉంచిన నమ్మకం, విశ్వాసాన్ని కోల్పోకుండా వారి తరఫున వారి సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో నా గొంతు వినిపిస్తా. ప్రజలు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా పనిచేస్తాను.

– డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఎమ్మెల్యే

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను...



సింగరేణి(కొత్తగూడెం): ప్రజల ఎదుర్కొనే సమస్యలపై పోరాటాల్లో ఎప్పుడూ ముందు నిలుస్తాం. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాలు కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో దొరల పాలన నుంచి ఇప్పుడు స్వేచ్ఛాగాలులు పీల్చుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో రెండింటి అమలును ఇప్పటికే ప్రారంభించింది. గత పాలనలో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి అనేక తిప్పలు పడేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌తో ఆ ఇబ్బందులు తీరినట్లే. కొత్తగూడెం ప్రజలు నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. వారి సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కారానికి పాటుపడతా.

– కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

గిరిజన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తా



వైరా: వైరా నియోజకవర్గంలోని గిరిజనులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తా. పదేళ్లుగా నియోజకవర్గంలో ఏ సమస్య కూడా పరిష్కారం కాలేదు. తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించగా.. ప్రజలు ఆశీర్వదించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడంతో పాటుగా విద్య వైద్య రంగాలకు నిధుల మంజూరుకు కృషి చేస్తా. నియోజకవర్గ ప్రజలు నన్ను ఎన్నో ఆశలతో గెలిపించారు. వారి ఆశలను వమ్ము చేయకుండా ప్రతీ పల్లెలోని ప్రజలకు ఆరు గ్యారంటీలను చేరవేసే బాధ్యతను తీసుకుంటా. సోనియాగాంధీ ఆశించిన బంగారు తెలంగాణ సాధన దిశగా అడుగులు వేసేందుకు ప్రయత్నం చేస్తా. జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రుల సూచనలు పాటిస్తూ అన్ని వర్గాల అభివృద్ధిలో భాగస్వామిని అవుతా.

– మాలోత్ రాందాస్‌నాయక్, వైరా ఎమ్మెల్యే

మరోమారు ప్రజలకు సేవ చేసే అవకాశం



ఇల్లెందు: రెండో దఫా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయటం ఆనందంగా ఉంది. తద్వారా ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు మరోమారు సేవ చేసే అవకాశం లభించింది. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన నేను ఇప్పటివరకు జెడ్పీ చైర్మన్‌గా పని చేసినా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించే అవకాశం ఎమ్మెల్యే పదవి ద్వారా దక్కుతుంది. ఈ అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది. రానున్న కాలంలో ఈ నియోజకవర్గ అభివృద్ధి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి అందరి సూచనల మేరకు ఐదేళ్ల కాలంలో చేపట్టాల్సిన పనుల ప్రణాళిక రూపొందిస్తా. చట్టసభల్లో ఇల్లెందు నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా.

– కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే

న్యాయం చేయాలని పాదయాత్రగా..



పాదయాత్రగా హైదరాబాద్ వెళ్తున్న శంకర్

కామేపల్లి/రఘునాథపాలెం: అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినందుకు కక్షగట్టి తనను ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంటూ ఓ వ్యక్తి తనకు న్యాయం చేయాలని కోరేందుకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు పాదయాత్రగా శనివారం బయలుదేరాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 104 వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న కామేపల్లికి చెందిన కేశగాని శంకర్ 104 డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగాడు. గతంలో ఆయన ఉద్యోగుల పీఎఫ్ తదితర అంశాల్లో రూ.90 లక్షల మేర అవకతవకలు జరిగాయని ఆరోపించడంతో అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. ఆ తర్వాత ఎవరిని ఆశ్రయించినా ఆయనను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తుండటంతో తన సమస్యను చెప్పుకునేందుకు శనివారం శంకర్ కామేపల్లి నుంచి పాదయాత్రగా బయలుదేరాడు. కాగా, రఘునాథపాలెం మండలంలోని బూడిదంపాడు వద్ద కాంగ్రెస్ నాయకులు శంకర్‌కు స్వాగతం పలికి తప్పక న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి నరసింహారావు, మంద గోపి తదితరులు ఉన్నారు.

లారీ బ్రేక్‌డౌన్.. నిలిచిన ట్రాఫిక్





జాతీయ ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక సమీపాన హైలెవెల్ వంతెన మీద శనివారం సాయంత్రం లారీ బ్రేక్ డౌన్ కావడంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తల్లాడ వైపు నుంచి చేపల లోడ్‌తో వైరా వైపు వస్తున్న భారీ లారీ మార్గమధ్యలోని హైలెవల్ వంతెనపై బ్రేక్ డౌన్ కారణంగా ఆగిపోయింది. జాతీయ ప్రధాన రహదారి కావడంతో ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మేడా ప్రసాద్ సిబ్బందితో చేరుకుని బ్రేక్ డౌన్ అయిన లారీకి మరమ్మతులు చేయించాక ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం నారాయణపురంలో శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏపీలోని చింతలపూడి మండలం అప్పలరాజుగూడెం, టి.నర్సాపురం గ్రామాలకు చెందిన బి.అశోక్, కె.నాగరాజు, కె.శివరామకృష్ణ ద్విచక్రవాహనంపై మల్బరీ మొక్కలు కొనుగోలు చేసేందుకు నారాయణపురం వస్తున్నారు. ఈ క్రమంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి ద్విచక్రవాహనం పడిపోవటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స చేయిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం వద్ద మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దమ్మాయిగూడెంనకు చెందిన వీరదాసు శ్రీను మోటార్‌సైకిల్‌పై తాళ్ల చెరువు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనుకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆదరణ ఫుల్... బస్సులు నిల్

- మొదటి రోజు మహిళలతో నిండిన భద్రాద్రి బస్టాండ్
- సరిపడా బస్సులు లేకపోవడంతో అసహనం



బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న మహిళలు



మహిళలతో బస్సులో రద్దీ

భద్రాచలంటౌన్: రాష్ట్రప్రభుత్వం మహిళకు ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని శనివారం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం ప్రారంభంపై విస్తృత ప్రచారం చేశారు. శనివారం మధ్యాహ్నం పథకాన్ని ప్రారంభించాక మహిళలతో ఆర్టీసీ బస్సులన్నీ రద్దీగా మారాయి. భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రతిరోజు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో వెళ్లేవారు సైతం బస్సుల కోసం రాగా, సాయంత్రానికి బస్టాండ్ మహిళలతో నిండిపోయింది. అయితే, బస్సులు సరిపడా లేకపోవడం, సమయానికి రాకపోవడంతో మహిళలు అసహనానికి లోనయ్యారు. భద్రాచలం బస్టాండ్ నుంచి రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచాలని వారు అధికారులను కోరారు.

రోజువారీ సర్వీసులు ఇవే..

భద్రాచలం డిపో నుంచి ప్రతిరోజు 24 పల్లె వెలుగు బస్సులు, 40 ఎక్స్‌ప్రెస్ బస్సులు రాష్ట్రంలోని నలుమూలలకు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం ద్వారా రోజూ 5వేల నుంచి 8వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. వారం రోజుల పాటు గమనించాక రద్దీ ఎక్కువగా ఉండే రూట్లను గుర్తించి బస్సుల సంఖ్య పెంచనున్నట్లు డిపో మేనేజర్ బి.రామారావు తెలిపారు.

జనసేన కేడర్‌కు, పవన్‌కు వార్

- జనసేన వెంట టీడీపీ ఉందని ప్రజలను నమ్మించాలి
- మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య



పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం జనసేన కేడర్‌కు, పవన్‌కళ్యాణ్‌కు మధ్య వార్ జరుగుతోందని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'పవన్ ఓట్లు కావాలంటారు.. జనసేన నాయకులు అధికారం కావాలంటారు. ఏది ముందు ఏది వెనుక అని విశ్లేషిస్తే జేజేలు, చప్పట్లు కాదు కావాల్సింది ఓట్లు అని పవన్‌కళ్యాణ్ అంటున్నారు.. ఓట్లు సరే అధికారం సంగతేంటి అని జనసైనికులు ప్రశ్నిస్తున్నారు. ఓట్లు వేసి జనసేనను గెలిపిస్తే అధికారం అదే వస్తుందని పవన్ అంటుంటే.. అధికారం వస్తుందని నమ్మిస్తే ఓట్లు అవే వస్తాయని జనసేన నేతలు అంటున్నారు. తాను కోరుకుంటున్నది అధికారం కాదని, రాష్ట్ర శ్రేయస్సు, ప్రజాశ్రేయస్సు అని పవన్ అంటుంటే.. అధికారం చేజిక్కకుండా ప్రజా శ్రేయస్సు ఎలా సాధిస్తారని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు..'అని పేర్కొన్నారు. ప్రస్తుతం జనసేన కేడర్, పవన్‌కు మధ్య జరుగుతున్న వార్ ఇదని తెలిపారు. తెలంగాణలో రాజ్యాధికారం చేపట్టడంలో ఆఖరి వరుసలో ఉందని సర్వేలు చెబుతున్నా తన సత్తా చూపించాలనే ఆతృతతో బీజేపీతో కలిసి పవన్ ఎన్నికల రంగంలోకి దిగడం సాహసోపేతమని పేర్కొన్నారు. తెలంగాణలో రాజ్యాధికారం చేపట్టలేదని తెలిసీ ఓటర్లు తమ ఓట్లను జనసేన–బీజేపీ కూటమికి వేసి ఎందుకు చేతులు కాల్చుకుంటారని ప్రశ్నించారు. ఏపీలో పరిస్థితి మాత్రం వేరని తెలిపారు. పవన్ 60 శాసనసభ సీట్లకు తక్కువ కాకుండా పోటీచేయవచ్చని పేర్కొన్నారు. అధికారం దక్కించుకోవడం పవన్ వంతు అయితే.. జనసేన–టీడీపీ కూటమికి ఓట్లు వేసి నెగ్గించుకోవడం తమ వంతు అని జనసేన కేడర్ దృఢ సంకల్పంతో ఉందని తెలిపారు. జనసేన టీడీపీని కలుపుకొని వైఎస్సార్‌సీపీని ఓడించి రాజ్యాధికారం దక్కించుకోవడానికి, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి దగ్గరలో ఉందని తెలిపారు. టీడీపీ వెనుక జనసేన అని కాకుండా.. జనసేన వెంట టీడీపీ ఉందని చెప్పి మూడునెలల్లో అధికారంలోకి రావడం తథ్యమని ప్రజలను నమ్మించగలగాలని ఆయన పేర్కొన్నారు.


ప్రకాశ్‌రెడ్డి


సుదర్శన్‌రెడ్డి


గిరిధర్‌రావు


నిరూప్‌రెడ్డి


అశోక్‌గౌడ్


మహేందర్‌రెడ్డి

ఏజీ.. ఎవరు!?

'అడ్వొకేట్ జనరల్'కు ప్రభుత్వ పరిశీలనలో పలువురి పేర్లు

- 'న్యాయ'పరంగా సర్కార్‌కు అత్యంత కీలకమైన పోస్టు
- సమర్థత, నమ్మకానికే ప్రాధాన్యం
- నిరూప్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గిరిధర్‌రావు, మహేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్‌లలో ఒకరికి అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కీలక పోస్టులు ఎవరికి దక్కుతాయన్న లెక్కలు వేసుకోవడం షురూ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో కీలక బాధ్యత పోషించే అడ్వొకేట్ జనరల్ ఎవరవుతారన్న దానిపై తీవ్ర చర్చ సాగుతోంది. ప్రస్తుత అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ రాజీనామా సమర్పించేందుకు సిద్ధం కావడంతో తర్వాతి ఏజీ ఎవరనేది చర్చాంశనీయంగా మారింది. ఒకసారి ఏజీ రాజీనామా ఆమోదం పొందితే.. జీపీలు, ఏజీపీల నియామకాలన్నీ రద్దవుతాయి. తిరిగి కొత్త వారిని నియమించాల్సి ఉంటుంది. స్పెషల్ జీపీలు, జీపీలు, ఏజీపీల మాట ఎలా ఉన్నా.. ఏజీ, ఏఏజీ ఎవరవుతారనేది న్యాయవర్గాల్లో చర్చకు తెరలేపింది.

సామాజిక సమీకరణాల కంటే సమర్థతకే మొగ్గు!

'న్యాయ'పరంగా సర్కార్‌కు అత్యంత కీలకమైన పోస్టు ఏజీ కావడంతో నియామకంలో సామాజిక సమీకరణల కంటే సమర్థతకే అవకాశం ఎక్కువ. ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నో కీలక కేసులు, అనుకూల కేసుల్లో వాదనలు వినిపించే నేపథ్యంలో నమ్మకంతో పాటు ఇతర అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. న్యాయవాదుల చట్టం 1961 సెక్షన్ 16(2), రాజ్యాంగంలోని అధికరణం 165 కింద అడ్వొకేట్ జనరల్ నియామకం జరుగుతుంది.

తెలంగాణ హైకోర్టు ఏజీలు వరుసగా...

- కె.రామకృష్ణారెడ్డి (2014 నుంచి 2017 వరకు)
- దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి (2017 నుంచి 2018 వరకు)
- బీఎస్ ప్రసాద్ (2018 నుంచి 2023 వరకు)

ఏజీకి ఏయే అధికారాలంటే..

- రాష్ట్రంలోని ఏ కోర్టుకైనా హాజరయ్యేందుకు ఏజీకి పూర్తి అధికారం ఉంటుంది.
- చట్టపరమైన విషయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇస్తుంటారు.
- ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదులు (స్పెషల్ జీపీ), జీపీ, ఏజీపీల నియామకాన్ని చేపడతారు.
- రాష్ట్ర ప్రభుత్వ విశ్వాసం ఉన్నంత వరకు (తొలగించే వరకు) ఏజీ ఆ పోస్టులో కొనసాగుతారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పేర్లు...

పి. నిరూప్ రెడ్డి

సుప్రీంకోర్టులో మూడు దశాబ్దాలుగా న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టులో అర్హత పొందిన తొలి తెలంగాణ వ్యక్తి. 1986లో న్యాయవాద వృత్తిలోకి వచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీ వేదికగా విశేష కృషి చేశారు. మేఘాలయ అదనపు అడ్వొకేట్ జనరల్‌గా, గోవా రాష్ట్ర సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈయనకు కాంగ్రెస్ పార్టీలోని ఢిల్లీ పెద్దలతో కూడా సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం.

దేశాయి ప్రకాశ్‌రెడ్డి

గతంలోనూ ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఏఏజీగా, తెలంగాణ వచ్చిన తర్వాత హైకోర్టులో ఏజీగా పనిచేశారు. 1977లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2000 సంవత్సరంలో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.

గిరిధర్‌రావు

గ్రూప్–1, గ్రూప్–2 వంటి కీలక కేసుల్లో వాదనలు వినిపించి.. విజయం సాధించారు. గ్రూప్–1 పేపర్ లీకేజీ కేసును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని వేసిన పిటిషన్‌లో వాదనలు వినిపించారు. 38 ఏళ్లు న్యాయవాదవృత్తిలో ఉన్నారు. 2021లో సీనియర్‌గా ప్రమోషన్ పొందారు. బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్లకు ఎన్నికై సేవలందించారు.

పొన్నం అశోక్‌గౌడ్.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా, రెండుసార్లు హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా కూడా విధులు నిర్వహించారు.

ఇంకా..

కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి తొలిసారి ఏజీగా బాధ్యతలు నిర్వహించిన (మాజీ ఏజీ) ఎ.సుదర్శన్ రెడ్డి, రేసు మహేందర్‌రెడ్డి లాంటి సీనియర్ల పేర్లు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు హైకోర్టు న్యాయవాద వర్గాలు పేర్కొంటున్నాయి.

కోటిన్నర కుటుంబాలకు అభయం..

ఆరోగ్యశ్రీ చికిత్సకు రూ.25 లక్షలు

- ఏపీలో ప్రజారోగ్యానికి సంపూర్ణ భరోసానిస్తూ సీఎం జగన్ అడుగులు
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో రూ.లక్షలు ఖరీదైన వైద్యం పూర్తి ఉచితం



సాక్షి, అమరావతి: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి ఊపిరి లూది పునర్జన్మ ప్రసాదించిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించాలని నిర్ణయించారు. తద్వారా గుండె, కిడ్నీ, న్యూరో లాంటి ఎంత పెద్ద జబ్బులకైనా చేతి నుంచి చిల్లి గవ్వ ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యం అందనుంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను 1,059 నుంచి ఏకంగా మూడు రెట్లకుపైగా పెంచి 3,257కి చేర్చిన సీఎం జగన్ ఇక క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు సైతం పరిమితి లేకుండా వ్యయాన్ని భరించేందుకు సిద్ధమయ్యారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు అత్యంత సులభంగా పొందేలా ఆధునిక ఫీచర్లతో కొత్తగా కార్డులను రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వతేదీన నూతన మార్గదర్శకాలు జారీ చేయనుంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

దేశ ఆరోగ్య రంగంలో తొలిసారిగా...

ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పలు పార్టీలు ఆరోగ్యశ్రీ తరహాలో ఉచిత వైద్యం అందిస్తామని హామీలిచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇవ్వగా బీఆర్ఎస్ రూ.15 లక్షల వరకూ ఉచిత వైద్యం సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కూడా రాజకీయ పార్టీలు ఇలాంటి హామీలనే ఇచ్చాయి. అయితే దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యానికి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం భరోసా నివ్వడం గమనార్హం. గతంలో క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే డబ్బులపై రూ.5 లక్షల వరకు పరిమితి ఉంది. ఆ తర్వాత ఎంత ఖర్చు అయినా రోగులే భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ పరిమితిని ఎత్తివేయడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా నిస్తున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు మార్పునకు కేంద్రం ఆమోదం

- కాకినాడ నుంచి నక్కపల్లికి మార్పు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో అభివృద్ధి... ప్రభుత్వ భూమిలోనే ఏర్పాటు చేయాలన్న కేంద్రం

సాక్షి, అమరావతి: బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ నుంచి అనకాపల్లి జిల్లా నక్కపల్లికి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పార్కును కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రూ.2,190 కోట్లతో ఫార్మాస్యూటికల్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇందు కోసం రూ.1,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరుస్తోంది. అయితే, ప్రభుత్వ భూమి మాత్రమే ఉండాలని కేంద్రం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. దీంతో కాకినాడ నుంచి నక్కపల్లి ప్రాంతానికి ఈ పార్కును మార్చారు. నక్కపల్లి వద్ద ఏపీఐఐసీ భూమి అందుబాటులో ఉండటం, అక్కడ ఇప్పటికే ఫార్మా రంగానికి చెందిన పలు పరిశ్రమలు ఉండటంతో రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే టెండర్లను న్యాయ పరిశీలనకు (జ్యుడిషియల్ ప్రివ్యూకు) పంపుతామని ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. న్యాయపరిశీలన అనంతరం ఆమోదం రాగానే టెండర్లు పిలుస్తామని చెప్పారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను అరికట్టాలన్న ఉద్దేశంతో దేశంలో మూడు బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. తెలంగాణ వంటి 16 రాష్ట్రాలతో పోటీ పడి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును దక్కించుకుంది. పూర్తిగా పర్యావరణహితమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పార్కును అభివృద్ధి చేస్తారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఫార్మా హబ్‌గా తయారవుతుందని, రూ.14,340 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా. ఇక్కడ 30,000 మందికి ప్రత్యక్షంగా, 40,000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 200కు పైగా ఫార్మా యూనిట్లు ఉన్నాయి. బల్క్ డ్రగ్ పార్కు ద్వారా అదనంగా 100కు పైగా యూనిట్లు వస్తాయని బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో ఐఏఎస్ అధికారి


ఆలయంలో ఐఏఎస్ అధికారి సూర్యతేజ, తదితరులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఐఏఎస్ అధికారి, ఏపీలోని ఏలూరు సబ్ కలెక్టర్ సూర్యతేజ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలోని మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ మేనిఫెస్టో విడుదల


ఐఎన్‌టీయూసీ మేనిఫెస్టో విడుదల చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఈనెల 27న జరగనుండగా, ఐఎన్‌టీయూసీ మేనిఫెస్టోను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం హైదరాబాద్ విడుదల చేశారు. తొలుత ఐఎన్‌టీయూ నాయకులు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేనిఫెస్టో విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి నాయకులు, కార్యకర్తలు సింగరేణి ఎన్నికల్లోనూ ఐఎన్‌టీయూ విజయానికి పాటుపడాలని కోరారు. కాగా, ఈనెల 20వ తేదీన ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ సంజీవరెడ్డి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో పర్యటిస్తారని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, నాయకులు ఆర్‌డీ.చంద్రశేఖర్, వికాస్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వమత సౌభ్రాతృత్వం..

- అన్ని మతాల పండుగలకు వేదికగా 'నాగుల్‌మీరా దర్గా'
- రేపటి నుంచి ఉర్సు ఉత్సవాలు
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


దర్గాలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్‌మీరా


దర్గా ప్రాంగణంలో అయ్యప్ప పడిపూజ (ఇన్‌సెట్) దర్గా ప్రాంగణంలో కొలువుదీరిన సీతారాముల విగ్రహాలు

ఇల్లెందురూరల్: అడుగడుగునా ప్రశాంతత ఉట్టిపడుతూ.. ఆధ్యాత్మిక శిఖరంగా, భక్తుల కొంగు బంగారమై విలసిల్లుతున్న క్షేత్రమది.. అదే ఇల్లెందు మండలంలోని అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజరత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా. ఇప్పుడు ఆ సన్నిధి ఉర్సు ఉత్సవానికి ముస్తాబవుతోంది. ఈ నెల 11వ తేదీ సోమవారం చాదర్‌ను, 12వ తేదీ మంగళవారం సందల్‌ను ప్రత్యేక ఊరేగింపుతో నాగుల్‌మీరా దర్గాకు చేరుస్తారు. సర్వమత సౌభ్రాతృత్వానికి వేదికగా నిలుస్తున్న ఈ దర్గా 21వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబవుతున్న నేపథ్యాన కథనం.

మతసామరస్యానికి ప్రతీకగా..

తరాలు మారినా సర్వమతాల సంస్కృతికి ప్రతీకగా వెలుగొందుతోంది హజ్రత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ దర్గాను హిందూ, ముస్లిం, క్రైస్తవులు పెద్ద ఎత్తున దర్శించుకొని ప్రార్థనలు చేస్తుంటారు. ఆధ్యాత్మిక సంపద, భక్తిశ్రద్ధలకు నిలయమైన ఈ దర్గాను దర్శించుకుని ప్రార్థన చేస్తే మంచే జరుగుతుందని భక్తుల నమ్మకం. ఆ నమ్మకంతోనే ఏటా జరిగే ఉర్సు ఉత్సవాలకు కులమతాలకతీతంగా భక్తులు భారీగా హాజరవుతారు.

అన్ని మతాల పండుగలూ..

అన్ని మతాలకు సంబంధించిన పండుగలు, విశేష కార్యక్రమాలను దర్గాలో నిర్వహిస్తారు. ఏటీ సీతారామనవమికి సీతారాముల కల్యాణం, అయ్యప్ప పడిపూజ, క్రిస్మస్, బతుకమ్మ, రంజాన్ వంటి పండుగలను ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా వేడుకల్లో అన్ని మతాలకు చెందిన ప్రజలు పాల్గొని తరిస్తుంటారు.

21వ ఉర్సు ఉత్సవాలకు వేళాయె..

మతసామరస్యానికి ప్రతీకగా అత్యంత వైభవంగా జరిగే ఉర్సే షరీఫ్ వేడుకలకు హజ్రత్ నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా ముస్తాబవుతోంది. ఏటా కార్తీక మాసంలో వచ్చే అమావాస్య రోజున ఉర్సు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఇల్లెందు పట్టణంలోని హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌కు సత్యనారాయణపురం శివారు అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా అనుబంధంగా కొనసాగుతోంది. పట్టణంలోని దర్గా షరీఫ్ నుంచి ఉత్సవాలు ప్రారంభమై నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాలో ముగుస్తాయి. హజ్రత్ ఖాసిం దుల్హా దర్గా షరీఫ్‌లో కార్తీక పౌర్ణమి రోజున ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు. తిరిగి సత్యనారాయణపురం శివారులోని దర్గాలో అమావాస్య రోజు వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. పట్టణంలోని దర్గా నుంచి ఈ నెల 11వ తేదీన చాదర్‌ను, 12వ తేదీన సందల్‌ను ప్రత్యేక ఊరేగింపుగా నాగుల్‌మీరా దర్గాకు చేరుస్తారు.

ఇరవై ఏళ్ల నుంచి నిర్విఘ్నంగా..

సత్యనారాయణపురం శివారు అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ చిల్లాలో 20 ఏళ్లుగా ఉర్సే షరీఫ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉర్సు ఉత్సవాల్లో కీలకమైన జులూస్ వేడుకల్లో పలు జిల్లాలకు చెందిన అయ్యప్ప మాలధారులే కాక హిందువులు, ముస్లింలు పాల్గొంటారు. ప్రత్యేకంగా అలంకరించిన నాలుగు గుర్రాల బగ్గీపై హజ్రత్ నాగుల్‌మీరా నిషానీతో ఇల్లెందు పట్టణంలోని పలు వీధుల్లో కన్నుల పండువగా జులూస్ కొనసాగుతుంది. అలాగే, హజ్రత్ పథకాలతో కూడిన ఒంటెలు, గుర్రాలతో వివిధ రాష్ట్రాలకు చెందిన మత పెద్దలు, మల్లాలు పాల్గొంటారు. జులూస్‌లో మర్ఫీలు ప్రదర్శించే విన్యాసాలు, ప్రదర్శనలు దర్గాలో అగ్నిపునీత కార్యక్రమాలను చూసి తరించాల్సిందే.

పెంపుడు జంతువులు.. పచ్చని అందాలు

హజ్రత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా ప్రాంగణంలో అరుదైన పెంపుడు జంతువులు, పూల మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఎటు చూసినా పచ్చందాల శోభ ఆకట్టుకుంటుంది. దర్గా ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లతో వీటిని పోషిస్తున్నారు. దేశవిదేశాల నుంచి సేకరించిన పూల మొక్కలు, ఆస్ట్రియా, టర్కీ తదితర దేశాల నుంచి తెచ్చిన అరుదైన పక్షులు, కోళ్లు, పావురాలు, కుందేళ్లు, బాతులు, ఈము పక్షులు, కూరగాయల తోటలు, పూల తోటలు, పండ్ల తోటలు ఆకట్టుకుంటాయి. దర్గాలో పూజల అనంతరం భక్తులు కాసేపు పచ్చని పందిళ్ల నడుమ సేదతీరతారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి రేపు దీక్ష

చర్ల: ఏజెన్సీలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో భద్రాచలంలోని ఏటీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం జరిగే దీక్షలకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పిలుపునిచ్చారు. చర్ల మండలంలోని ఉప్పరిగూడెంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి సఫలీకృతమయ్యామని, తద్వారా గిరిజన యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు దక్కాయని తెలిపారు. కాగా, ఎటపాక సమీపాన పాలిటెక్నిక్ నుంచి వయా ఆర్లగూడెం మీదుగా లక్ష్మీనగరం వరకు బస్సు సౌకర్యం, భద్రాచలంలోని మూడు జీపీలకు ఎన్నికలు నిర్వహించాలనే తదితర డిమాండ్లతో చేపడుతున్న దీక్షను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బూటారి ముత్తయ్య, ఇర్పా సూరిబాబు, తాటి మోహన్‌రావు, తెల్లం సతీష్, బోడిక రవి, మచ్చా వీరాస్వామి, బోడిక నాగేంద్రబాబు, పర్శిక సిద్ధార్థ, సోయం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అండర్–19 రాష్ట్ర టీ.టీ. జట్టులో ఖమ్మం క్రీడాకారిణి


జాతీయ స్థాయికి ఎంపికైన నిరీక్షణ


తృతీయస్థానంలో నిలిచిన అండర్–19 బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో భాగంగా హైదరాబాద్‌లో జరుగుతున్న అండర్–19 టేబుల్ టెన్నిస్ టోర్నీలో ఖమ్మంకు చెందిన ఎం.నిరీక్షణ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. తొలిసారిగా జిల్లా నుంచి టేబుల్ టెన్నిస్ జాతీయ స్థాయికి ఆమె ఎంపిక కావడం విశేషం. అలాగే, బాలుర విభాగంలో తరుణ్ ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో స్టాండ్‌బైగా ఎంపికయ్యాడు. ఇక అండర్–19 బాలబాలికల విభాగంలో జిల్లా జట్లు తృతీయస్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా పాఠశాలలు, జూనియర్ కళాశాలల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, ఎం.డీ.మైసాకలీంతో పాటు జంగాల సునీల్‌కుమార్, కూరపాటి ప్రదీప్‌కుమార్, ఓలేటి సాంబమూర్తి అభినందించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌జీపీఏటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు


పరిశ పుల్లయ్య, అధ్యక్షుడు


కె.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం సుపరిపాలన సాగించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం తెలంగాణ(ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు కోరారు. ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా సమావేశం పరిశ పుల్లయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజేంద్రబాబు మాట్లాడుతూ ప్రజలు పాలనలో మార్పు కోరి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తూ, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర బాధ్యులు టి.పురుషోత్తం, బి.నర్సయ్య, ఎస్.యాదయ్య, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎస్‌జీపీఏటీ ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణమూర్తి, కోశాధికారిగా వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. అలాగే, ఉపాధ్యక్షులు బి.కృష్ణకుమారి, పి.సత్యనారాయణ, ఎం.డీ.శాసిం సాహెబ్, కె.శరత్‌బాబు, కార్యదర్శులుగా ఎ.ప్రకాష్, బి.రాధాకృష్ణమూర్తి, జి.శ్రీనివాసరావు, టి.మురళి, మహిళా కార్యదర్శులుగా వి.లక్ష్మి, ఎం.సరస్వతి, సలహా మండలి సభ్యులుగా ఎం.డీ.అబ్దుల్ ఇబ్బార్, ఎం.డీ.అబ్దుల్ నహీం, పి.సుధాకర్, జి.వెంకటేశ్వరరావు, ఎం.మధు ఎన్నికయ్యారు.

క్రమశిక్షణ, ప్రణాళికతో చదివితేనే లక్ష్యసాధన

ఎస్‌బీఐటీలో వివిధ కంపెనీల ప్రతినిధుల ముఖాముఖి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ప్రణాళికాయుతంగా చదివితేనే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో కలిసి విద్యార్థులకు శనివారం ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీఎల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్, టీసీఎస్ కంపెనీ రీజినల్ హెడ్ రిచర్డ్ కింగ్, బిర్లా సాఫ్ట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అబూబకర్, సరీవ్స్ నౌ డైరెక్టర్ జి.భాస్కర్ తదితరులు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకునేలా కోర్సులను ఎంచుకుంటే ఫలితం వస్తుందని తెలిపారు. అనంతరం ఐటీ రంగంలో ఉన్న కోర్సులు, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్, టీపీఓ సరిత తదితరులు పాల్గొన్నారు.